క్లుప్తంగా

పాఠశాల బోరుకు మరమ్మతులు

- వైఎస్సార్‌సీపీ నేత దాతృత్వం



బోరుకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

సంగం : మండల కేంద్రంలోని బాలికల గురుకుల కళాశాలలో నాలుగు రోజులుగా పని చేయకుండా ఉన్న బోరుకు గురువారం మరమ్మతులు చేశారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నేత మెట్టుకూరు వాసుదేవరెడ్డి తన సొంత నిధులు రూ.10 వేలు వెచ్చించి బోరుకు మరమ్మతులు చేయించి నీటి సమస్యను పరిష్కరించారు. దీంతో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు వాసుదేవరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

వృద్ధాశ్రమ ఏర్పాటుపై సమావేశం



సమావేశమైన ఎల్డర్స్ క్లబ్ సభ్యులు

కావలి : పట్టణంలో ఎల్డర్స్ క్లబ్ ఆధ్వర్యంలో వృద్ధాశ్రమ ఏర్పాటుకు శ్రీకారం చుడుతున్నట్లు క్లబ్ ప్రతినిధులు ప్రకటించారు. పట్టణంలో ఎల్డర్స్ క్లబ్ ప్రతినిధులు గురువారం సమావేశమయ్యారు. వృద్ధాశ్రమానికి సంబంధించి స్థల సేకరణ విషయమై కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ఆర్డీఓను కలిసి అర్జీలు సమర్పించామని, తమ వంతుగా కూడా స్థల సేకరణకు కృషి చేస్తున్నట్లు కమిటీ అధ్యక్షుడు జేబీఎమ్ నాయుడు పేర్కొన్నారు. ఈ స్థలాన్ని వృద్ధాశ్రమ ట్రస్టు పేరున రిజిస్టర్ చేసే క్రమంలో పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని ఉపాధ్యక్షులు కె.గోపీకృష్ణ, సి.శారద, జాయింట్ సెక్రటరీ విద్యావతి, పార్వతీశంకర్ తెలియజేశారు. సమావేశంలో కోటిరెడ్డి, జి.సింగయ్య, బి.వీరాస్వామి, ఎస్.రామచంద్రయ్య, కె.లలిత, కె.స్వర్ణలత, వి.పద్మావతి ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి ట్రాకింగ్ వ్యవస్థ



మాట్లాడుతున్న ఎంపీపీ వేణుగోపాల్‌రెడ్డి

ఆత్మకూరురూరల్ : నియోజకవర్గంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి అందిన అర్జీల పరిష్కారానికి ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి గ్రీవెన్స్ ట్రాకింగ్ వ్యవస్థను ఏర్పాటు చేశారని ఆత్మకూరు ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్‌లకు గురువారం నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి అర్జీని ట్రాకింగ్ వ్యవస్థ పరిధిలోకి తెస్తారని, ఆయా సమస్యల పురోగతిని దరఖాస్తుదారుడు ఎప్పుడైనా తెలుసుకునే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్, ఈఓఆర్డీ ఉషారాణి పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ



డీఎల్‌పీఓకు వినతి పత్రం అందజేస్తున్న కార్మికులు

ఉదయగిరి : పంచాయతీ నిధులు దుర్వినియోగం చేశారంటూ బాషా అనే వ్యక్తి జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో కావలి డీఎల్‌పీఓ రాధా మాధవీలత గురువారం పంచాయతీ కార్యాలయంలో విచారణ చేశారు. ముందుగా రికార్డులు పరిశీలించారు. అనంతరం ఫిర్యాదుదారుడు బాషా, ఈఓ నరసయ్యతో మాట్లాడారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ విచారణలో గుర్తించిన అంశాలను జిల్లా అధికారులకు నివేదిక పంపిస్తామని, వారి ఆదేశాల మేరకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులకు ఆగిపోయిన వేతనాలను ఇప్పించాలని వారు వినతిపత్రం అందజేశారు. వచ్చే నెల 1వ తేదీలోపు బకాయిలు చెల్లిస్తామని ఆమె హామీ ఇచ్చారు.

రేపు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

ఆత్మకూరురూరల్ : స్థానిక ఆర్టీసీ డిపోలో శనివారం ఉదయం 11 గంటలకు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ కరీమున్నీసా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో ఆర్టీసీ అధికారుల బృందం పాల్గొని ఆత్మకూరు వాసులు ఫోన్ ద్వారా తెలియజేసే సమస్యలను పరిష్కరిస్తామని, ఏమైనా సలహాలు ఉంటే స్వీకరిస్తామని తెలియజేశారు. 99592 25645 నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

సహకార బ్యాంక్‌ల బలోపేతానికి కృషి

- ఉదయగిరి సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి
- డీసీసీ బ్యాంక్ నిర్మాణానికి శంకుస్థాపన



డీసీసీ బ్యాంక్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

జలదంకి : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రైతుల కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టడంతో పాటు సహకార బ్యాంకుల బలోపేతానికి కృషి చేస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ జలదంకి శాఖ నూతన భవన నిర్మాణ పనులను మండల కేంద్రంలో రాజగోపాల్‌రెడ్డి గురువారం శంకుస్థాపన చేశారు. నాబార్డు నిధులు రూ.45 లక్షలతో చేపట్టిన పనులను ఆయన టెంకాయ కొట్టి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ జలదంకిలో సహకార బ్యాంకు ఏర్పాటు వల్ల రైతులకు పంట రుణాలు అందుతాయని, అలాగే బ్యాంకు సేవలు కూడా అందుబాటులోకి వస్తాయన్నారు. దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం ఆయన అన్నవరం సచివాలయ ఆవరణలో ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సెంట్రల్ బ్యాంకు సీఈఓ చల్లా శంకర్‌బాబు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు పాలవల్లి మాలకొండారెడ్డి, సొసైటీ చైర్మన్ కేతిరెడ్డి రవీంద్రరెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు మేదరమెట్ల శివలీల, సొసైటీ డైరెక్టర్లు ఇస్కా మదన్‌మోహన్‌రెడ్డి, గొట్టిపాటి ప్రసాద్‌నాయుడు, పార్టీ నేతలు రావి ప్రసాద్‌నాయుడు, గుర్రం ధనుష్, సురె వెంకటశేషారెడ్డి, కోర్శిపాటి రామిరెడ్డి, చేజర్ల హరిబాబురెడ్డి, ఆలూరు నరసారెడ్డి, బోడిమండ్ల కృష్ణారెడ్డి, గుమ్మడి రమేష్, చేరెడ్డి మస్తాన్‌రెడ్డి, డి.గోపాల్‌రెడ్డి, వాసిపల్లి పద్మనాభరెడ్డి పాల్గొన్నారు.

పకడ్బందీగా 'అక్షర చైతన్యం' పరీక్షలు



అనుమసముద్రంపేట : మాట్లాడుతున్న ఎంపీపీ బోయళ్ల పద్మజారెడ్డి



ఉదయగిరి : మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీనివాసులు



అనంతసాగరంలో మాట్లాడుతున్న ఎంఈఓ బాలకృష్ణారెడ్డి

అనుమసముద్రంపేట : అక్షర చైతన్యం కార్యక్రమంలో భాగంగా ఈనెల 24న నిర్వహించనున్న వయోజనుల పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని ఏఎస్‌పేట ఎంపీపీ బోయళ్ల పద్మజారెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఉపాధ్యాయులతో గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని 19 పంచాయతీల పరిధిలో 1,235 మంది వయోజనులు చదువుకున్నారని, వారంతా పరీక్షలు రాసి నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. క్షేత్రస్థాయిలో ప్రతి ఒక్కరిని కలిసి పరీక్షలు రాసేలా చూడాల్సిన బాధ్యత వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులపై ఉందన్నారు. వయోజన విద్య సూపర్‌వైజర్ జి.అంకారావు మాట్లాడుతూ గతేడాది అక్టోబర్ 2 నుంచి మండలాల్లో ఉన్న వయోజనులకు విద్య నేర్పుతున్నారని తెలియజేశారు. అక్షర చైతన్యం పరీక్షలను బాధ్యత నిర్వహించి మండలాన్ని ప్రథమ స్థానంలోకి తీసుకురావాలని ఎంపీడీఓ భాస్కర్ కోరారు. ఈ సందర్భంగా విద్యాసామగ్రిని ఎంపీపీ అందజేశారు.

వయోజనుల పరీక్షపై సమీక్ష

ఉదయగిరి : అక్షర చైతన్యం వయోజనుల పరీక్షలకు సంబంధించి ఉదయగిరిలోని స్త్రీ శక్తి భవనంలో ఎంపీడీఓ ఈశ్వరమ్మ, ఎంఈఓ తోట శ్రీనివాసులు గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు వలంటీర్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. మండలంలో 330 మంది వయోజనులకు 24న పరీక్ష నిర్వహిస్తున్న నేపథ్యంలో ఏర్పాట్లు, నిర్వహణ తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో అక్షర చైతన్యం మండల కోఆర్డినేటర్ బాదుల్లా ఉన్నారు.

అవగాహన

చేజర్ల(సోమశిల) : అక్షర చైతన్యం-2 పరీక్షపై అనంతసాగరం ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఎంఈఓ బాలకృష్ణారెడ్డి మండలంలోని 46 సెంటర్లలో పరీక్షల నిర్వహణ, విధి విధానాలపై పాఠశాలల హెచ్‌ఎంలు, సీఆర్‌ఎంటీలకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వయోజన విద్య జిల్లా సూపర్‌వైజర్ ఎల్.రామ్‌కుమార్ మాట్లాడుతూ ఈ పరీక్షను విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మధుసూదనరావు, ఎంఈఓ-2 కె.ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



అల్లూరు : మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీదేవి

- అల్లూరు : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అక్షర చైతన్యం పరీక్షపై ఎంపీడీఓ శ్రీదేవి గురువారం అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 24న ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పరీక్ష జరుగుతుందని, మండల పరిధిలో దాదాపు 514 మంది పరీక్షకు హాజరవుతారన్నారు. వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషనల్ అసిస్టెంట్లు ఇన్విజిలేటర్లుగా వ్యవహరిస్తారని, దీనిపై వారికి శిక్షణ ఇచ్చామన్నారు. కార్యక్రమంలో అడల్ట్ ఎడ్యుకేషన్ డిప్యూటీ డైరెక్టర్ నారాయణరావు, ఎంఈఓ రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

బాబా మందిరంలో అన్నదానం



వరికుంటపాడు : వరికుంటపాడులోని సాయినాథుని మందిరంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కండ్లగుంట వెంకటరెడ్డి, వెంకటలక్ష్మమ్మ దంపతుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అన్నదాన దాతలను సత్కరించారు.

సేవా పక్వాడలో భాగంగా..



కావలి : మండలంలోని కొనదిన్నె గిరిజన కాలనీలో గురువారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో సుమారు 200 మందికి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ కావలి చైర్మన్ డి.రవిప్రకాష్ మాట్లాడుతూ సేవా పక్వాడలో భాగంగా రక్తదాన శిబిరాలు, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రెడ్‌క్రాస్ ప్రతినిధులు పద్మావతి, వెంకటేశ్వరరెడ్డి, కృష్ణవేణి పాల్గొన్నారు.

నేడు గరిమెనపెంటలో 'గడప గడపకు..'

కొండాపురం : మండలంలోని గరిమెనపెంట పంచాయతీలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం శుక్రవారం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చిమ్మిలి రవీంద్ర గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పాల్గొనే కార్యక్రమంలో మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

వేడుకగా వినాయక నిమజ్జనం

వరికుంటపాడు : మండలంలోని ఆండ్రావారిపల్లెలో వినాయక నిమజ్జనం గురువారం వేడుకగా జరిగింది. ముందుగా యువత ఉట్టి మహోత్సవం నిర్వహించారు. అలాగే విఘ్నేశ్వరుని చేతిలో ఉంచిన లడ్డూను వేలంపాట నిర్వహించగా కండ్లగుంట వెంకటరెడ్డి, వెంకట లక్ష్మమ్మ దంపతులు రూ.27,500కు లడ్డూను దక్కించుకున్నారు. అనంతరం బొజ్జ గణపయ్యకు పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించి నిమజ్జనం చేశారు.

పేకాట స్థావరంపై దాడి

కావలి : కావలి రూరల్ మండలం మాతినవారిపాళెం గ్రామ పొలాల్లో పేకాట ఆడుతున్న ఏడుగురిని గురువారం అదుపులోకి తీసుకున్నట్లు కావలి రూరల్ ఎస్సై ఎస్.సుమన్ చెప్పారు. వారి వద్ద రూ.4,200 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు.

అసోసియేట్ ప్రొఫెసర్‌కు పీహెచ్‌డీ



కొడవలూరు: నార్తురాజుపాళెంలోని వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల ఈసీఈ విభాగ అసోసియేట్ ప్రొఫెసర్ గిరీష్ గాంధీ కేఎల్ఈఎఫ్ వర్సిటీ, విజయవాడ నుంచి పీహెచ్‌డీ పొందారు. డిజైన్ సిమ్యులేషన్, మోడలింగ్ అండ్ అనాలసిస్ వేరియస్ స్విచెస్ ఫర్ - 3 అప్లికేషన్స్‌కు పీహెచ్‌డీ లభించింది. కేఎల్ఈఎఫ్ వర్సిటీ విభాగ ప్రొఫెసర్ గోవర్ధని పర్యవేక్షణలో పరిశోధన గ్రంథాన్ని సమర్పించారు. కాగా గిరీష్ గాంధీని కళాశాల చైర్మన్ గుణశేఖర్ గురువారం అభినందించారు.

పర్యావరణ పరిరక్షణ భాగస్వామిగా ఎస్ఈఐఎల్

- వీఎస్‌యూ వీసీ జీఎం సుందరవల్లి



సంస్థ సీఈఓకు జ్ఞాపిక అందజేస్తున్న వీసీ

వెంకటాచలం: మండలంలోని కాకుటూరు వద్ద నున్న విక్రమ సింహపురి యూనివర్సిటీ పర్యావరణ పరిరక్షణ భాగస్వామిగా ఎస్ఈఐఎల్ సంస్థను గుర్తిస్తున్నట్లు వర్సిటీ వీసీ జీఎం సుందరవల్లి తెలిపారు. వీఎస్‌యూకు న్యాక్ ఏ గ్రేడ్ లభించడంలో ఆ సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమాలు ఎంతో దోహదం చేశాయి. ఈ క్రమంలో గురువారం సంస్థ సీఈఓ రాఘవ్ త్రివేది వర్సిటీకి వచ్చి వీసీ సుందరవల్లిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన్ను ఆమె సన్మానించి జ్ఞాపిక అందజేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ యూనివర్సిటీలో పర్యావరణ పరిరక్షణతోపాటు, సోలార్ సిస్టం, సోలార్ హీటర్లను ఆ సంస్థ అందించిందని చెప్పారు. వారి సహకారానికి కృతజ్ఞతలు తెలియజేశారు. వర్సిటీ అభివృద్ధికి తమ సంస్థ అన్ని రకాలుగా అండగా నిలుస్తుందని రాఘవ్ త్రివేది తెలిపారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.రామచంద్రారెడ్డి, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆత్మకూరులో పెన్షనర్ల సమావేశం



సుధాకర్‌రావుకు సన్మానం

ఆత్మకూరు : పెన్షనర్ల సంఘ మండల సర్వసభ్య సమావేశం గురువారం ఆత్మకూరులో నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ ప్రధాన కార్యదర్శి సుధాకర్‌రావును సన్మానించారు. సమస్యల పరిష్కారం కోసం ఆయన చేస్తున్న కృషిని గుర్తుచేశారు. కార్యక్రమంలో లక్కు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గణనాథులకు విశేష పూజలు



చేజర్ల : మడపల్లిలో విశేషాలంకరణలో గణనాథుడు

చేజర్ల : మండలంలోని పలుచోట్ల నాలుగో రోజు గురువారం వినాయక చవితి పూజలు ఘనంగా జరిగియి. మడపల్లి గ్రామం తూర్పువీధిలో స్థానిక యూత్ ఆధ్వర్యంలో గణనాథునికి విశేష పూజలు నిర్వహించారు. ప్రసాదాలు పంచిపెట్టారు.

- అనంతసాగరం మండలంలో పలుచోట్ల గణనాథునికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. సోమశిల గ్రామం అరుంధతీయవాడలో గణనాథునికి పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈశ్వరయ్య, శంకరయ్య, రమణయ్య, సుబ్బరాయుడు, వెంకట్రావ్, నరేష్, పెంచలయ్య, రవి, ప్రసాద్ పాల్గొన్నారు.



సోమశిలలో అన్నదాన కార్యక్రమం

కోలాహలంగా ఉట్టి మహోత్సవం

సంగం : మండల పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం ఉట్టి మహోత్సవాలు కోలాహలంగా జరిగాయి. సంగం పట్టణంలోని శివాజీ సెంటర్‌తో పాటు వడ్డెరపాళెం, అరుంధతీయవాడలో యువకులు, చిన్నారులు ఉత్సాహంగా ఉట్టి కొట్టారు.

తల్లీబిడ్డ ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయం



ఉదయగిరి : పౌష్టికాహారం గురించి వివరిస్తున్న సీడీపీఓ

ఉదయగిరి : తల్లీబిడ్డ ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయమని సీడీపీఓ లావణ్య అన్నారు. మండలంలోని వెంగళరావు నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవం గురువారం జరిగింది. ఈ సందర్భంగా బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహార ప్రాముఖ్యత గురించి వివరించారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు ఉండే ఆహారం ఎలా తయారు చేసుకోవాలో తెలియజేశారు. అనంతరం పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

చేజర్ల : గర్భిణులు, బాలింతలు తప్పక పౌష్టికాహారం తీసుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సీహెచ్ సురేఖ పేర్కొన్నారు. మండలంలోని కాకివాయి మెయిన్ అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన పౌష్టికాహార మాసోత్సవాల్లో ఆమె గురువారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిరుధాన్యాలు, ఆకు కూరలు అధికంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కె.సుబ్బయ్యనాయుడు, హెచ్‌ఎం ఎం.మహేశ్వరరెడ్డి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరోగ్య సర్వేపై ఎంపీడీఓ ఆరా



సర్వే వివరాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

సంగం : మండలంలోని జెండాదిబ్బ గ్రామంలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను ఎంపీడీఓ గోపి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే నిర్వహిస్తున్న సిబ్బందిని పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆరోగ్య సురక్షకు సంబంధించిన సర్వే పక్కాగా జరగాలని, దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రతి ఇంటిని విజిట్ చేయాలని సూచించారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆందోళన



ఆందోళన చేస్తున్న వివిధ సంఘాల నేతలు

ఆత్మకూరురూరల్(మర్రిపాడు) : మాదిగ ఉపకులాల వర్గీకరణ కోసం ఆ సంఘ నాయకులు మర్రిపాడు మండల కేంద్రంలో గురువారం ఆందోళన చేపట్టారు. ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ పందిటి అంబేడ్కర్ మాదిగ మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని, లేనిపక్షంలో రానున్న ఎన్నికల్లో బీజేపీకి తమ సత్తా చూపిస్తామన్నారు. కార్యక్రమంలో ఆ సంఘ జిల్లా కో-కన్వీనర్ తాటిపర్తి లక్ష్మయ్యతో పాటు వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు



ఆత్మకూరు : అండర్-14 పరుగుపందెం పోటీలో తలపడుతున్న విద్యార్థినులు



ఉదయగిరిలో జరుగుతున్న క్రీడా పోటీలు

- జిల్లా స్థాయి పోటీలకు ఎంపికలు

ఆత్మకూరు : నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో గురువారం అట్టహాసంగా జరిగింది. వివిధ మండలాల్లోని విద్యార్థులు అండర్-14, 17 విభాగాలకు సంబంధించిన పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని, ప్రతిభ చాటి జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. మూడు రోజుల పాటు జరుగనున్న ఎంపికలకు శాప్ డైరెక్టర్ కాలువ శ్రీనివాసులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్, నియోజకవర్గ స్పోర్ట్స్ కోఆర్డినేటర్ పీడీ తిరుపతయ్య, ఎంఈఓ షేక్.నజీర్ క్రీడాపోటీలను ప్రారంభించి, మాట్లాడారు. నియోజకవర్గంలోని 220 మంది విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తున్నామని, ఇక్కడ ఎంపికైన వారిని జిల్లా స్థాయి పోటీలకు పంపనున్నట్లు తెలిపారు. తొలిరోజు 200, 600, 800, 1500 మీటర్ల పరుగు పందేం, షార్ట్‌పుట్, డిస్కస్‌త్రో, హైజంప్, యోగా, టెన్నికాయిట్ తదితర క్రీడల్లో పోటీలు నిర్వహించి ఎంపిక చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం అనంతలక్ష్మి, కౌన్సిలర్ సూరా భాస్కర్‌రెడ్డి, విద్యా కమిటీ చైర్మన్ మల్లికార్జున, పీఈటీలు సీహెచ్ సురేష్, గౌరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూరు : పోటీలను ప్రారంభిస్తున్న శాప్ డైరెక్టర్, ఎంపీడీఓ, ఎంఈఓలు

ఉదయగిరిలో..

వింజమూరు(ఉదయగిరి) : స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నియోజకవర్గ స్థాయి ఎస్‌జీఎఫ్ బాలబాలికల అండర్- 14, 17 ఆటల పోటీలు గురువారం ప్రారంభమైంది. మొత్తం ఎనిమిది మండలాల్లో ఉన్న 52 ఉన్నత పాఠశాలల నుంచి విద్యార్థులు తలపడ్డారు. పోటీల న్యాయనిర్ణేతలుగా పీడీలు ఎస్.ప్రభాకర్‌రెడ్డి, ఎం.తిరుపాల్‌రెడ్డి, వెలుగోటి కృష్ణ, రోశిరెడ్డి, జిలాని, సుమలత, రజిని వ్యవహరించారు. జెడ్పీటీసీ సభ్యుడు గణపం బాలకృష్ణారెడ్డి, సర్పంచ్ సృజన, ఎంఈఓ మధుసూదన్‌రెడ్డి కలిసి పోటీలను ప్రారంభించారు. ఇక్కడ ప్రతిభ చూపిన వారు 25న నెల్లూరులో జరిగే జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటారు.




ఆత్మకూరు : పరుగు పందెంలో రాణించిన వి.అమృత, మోహిని





ఆత్మకూరు : షార్ట్‌పుట్‌లో రాణించిన వై.నవ్యజ్యోతి, కె.వెంకట కిశోర్, చందు




డిస్కస్‌త్రోలో రాణించిన పి.ఐశ్వర్య, బి.అశోక్